క్లుప్తంగా

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు



శ్రీశైలం టెంపుల్: లోకకల్యాణంకోసం దేవస్థానం గురువారం ఆలయప్రాంగణంలోని త్రిఫలవక్షం కింద వెలసిన దత్తాత్రేయస్వామి వారికి విశేష పూజలను నిర్వహించింది. పూజాకార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతిపూజను జరిపించారు. తరువాత స్వామి వారికి పంచామతాభిషేకం, విశేషపూజలు నిర్వహించారు.

బరక సంజీవరాయుడికి ప్రత్యేక పూజలు



అలంకరణలో స్వామివారు

మిడుతూరు: రోళ్లపాడు అభయారణ్యంలో వెలసిన శ్రీ బరక సంజీవరాయ స్వామి వారికి అమావాస్యను పురస్కరించుకొని గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ, పల్లకీ సేవా తదితర విశేష పూజలను పురోహితులు నరహరి శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల తోపాటు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జయసూర్యకు సన్మానం



ఎమ్మెల్యే జయసూర్యను సన్మానిస్తున్న బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు

నందికొట్కూరు: మండల పరిధిలోని అల్లూరు గ్రామంలో మాండ్ర శివానందరెడ్డి స్వగృహంలో ఎమ్మెల్యే జయసూర్యను బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చల్లా దామోదర్‌రెడ్డి, స్థానిక నాయకులు శ్రీకాంత్, శంకర్, విజేయుడు, కార్యకర్తలు కలిసి గురువారం సన్మానించారు. అలాగే బీజేపీ, ఎమ్మార్పీఎస్, టీడీపీ నాయకులు అభినందనలు తెలిపారు.

బోర్లకు మరమ్మతులు



కురుకుందలో బోర్లకు మరమ్మతులు చేస్తున్న సర్పంచ్

ఆత్మకూరు: మండలంలోని కురుకుంద గ్రామంలో గురువారం మంచినీటి సమస్య పరిష్కారం కోసం బోర్లకు మరమ్మతులు చేశారు. సర్పంచ్ మహబూబ్‌బీ మాట్లాడుతూ గ్రామంలో నీటి సమస్య లేకుండా చెడిపోయిన బోర్లకు మరమ్మతులు చేస్తున్నామని తెలిపారు. బోర్లలో తక్కువగా నీరు ఉండడం, చేతి పంపులు సరిగా లేకపోవడంతో వాటిని తొలగించి నూతన పైపులు, చేతిపంపులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బందెలమాబు, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్బీకేలను సద్వినియోగం చేసుకోండి



గువ్వలకుంట్ల ఆర్బీకేలో నిల్వ ఉన్న ఇఫ్కో డీఏపీ ఎరువు బస్తాలు

కొత్తపల్లి: రైతులను ఆర్బీకేలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.మహేష్ సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 11 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయని అందులో కొత్తపల్లి, గువ్వలకుంట్ల గ్రామాలలోని ఆర్బీకేలలో రసాయన ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్నందున అన్ని ఆర్బీకేలలో ఇఫ్కో డీఏపీ ఎరువు అందుబాటులో ఉందన్నారు. డీఏపీ కావాల్సిన రైతులు వారి ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్‌తో ఆర్బీకే సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో..

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు గురువారం పూజలు నిర్వహించారు. ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించుకొని అభిషేకం, అర్చన పూజలు చేశారు. అనంతరం అలంకార మండపంలో ఆయనకు స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదపండితులు ఆశీర్వచనం చేశారు.



తలముడిపి వద్ద కుందూ వాగు ఉధృతి



మిడుతూరు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కాకిలేరు వాగు



స్థానిక ఎస్సీ కాలనీలోకి చేరిన వర్షపు నీరు



కూలిన మిద్దెను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

భారీ వర్షం

- ఉప్పొంగిన వాగులు, వంకలు
- మిడుతూరు – తలముడిపి మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూ వాగు
- నిలిచిపోయిన రాకపోకలు
- మిడుతూరు ఎస్సీ కాలనీలోకి చేరిన వర్షపు నీరు
- వర్షం ధాటికి కూలిన మిద్దె



మిడుతూరు ఎస్సీకాలనీ వద్ద కాకిలేరు వాగు ఉధృతికి కొట్టుకుపోయిన కారును ట్రాక్టర్ సాయంతో ఒడ్డుకు చేర్చేందుకు యత్నిస్తున్న స్థానికులు

మిడుతూరు: మండలంలో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి చింతాగు, కుందూ, కాకిలేరు వాగులు పొంగి పొర్లాయి. మండల కేంద్రమైన మిడుతూరులోని ఎస్సీ కాలనీలోకి కాకిలేరు వాగు నీటి ప్రవాహం రావడంతో కాలనీ జలమయమైంది. మిడుతూరు వద్ద నంద్యాలకు వెళ్లే ప్రధాన రహదారిపై కాకిలేరు వాగు ఉధృతి కారణంగా నంద్యాల వైపుకు వెళ్లే వాహనాలు నిలిచిపోయాయి. నీటి ప్రవాహం ఒక్కసారిగా పెరగడంతో పార్కింగ్ ప్రదేశంలో ఉంచిన కారు నీటి ప్రవాహానికి కొట్టుకొని పోతుండటంతో గమనించిన స్థానికులు ట్రాక్టర్ సాయంతో తాళ్లను కట్టి ఒడ్డుకు చేర్చారు. గ్రామానికి చెందిన తెలుగు వెంకటలక్ష్మమ్మకు చెందిన కాంక్రీట్ మిద్దె వర్షం ధాటికి ఒక్కసారిగా కుప్పకూలింది. ఇంటిలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అదేవిధంగా బైరాపురం, తిమ్మాపురం గ్రామాల్లో కాకిలేరు ఉధృతికి రాకపోకలు నిలిచాయి. పీరుసాహెబ్ పేట - కడుమూరు గ్రామాల మధ్య నాపరాతి గనుల వద్ద వర్షపు నీటి ఉధృతికి బ్రిడ్జి పక్కనున్న స్తంభాలు పడిపోయాయి. బ్రిడ్జి రైలింగ్ స్తంభాలు నీటి ప్రవాహానికి కొట్టుకపోయాయి. దీంతో ఈ గ్రామాల మధ్య రాకపోకలు అంతరాయం ఏర్పడింది.

వరదొచ్చినా స్పందించని రెవెన్యూ సిబ్బంది

బుధవారం అర్ధరాత్రి నుంచి కురుస్తున్న వర్షం కారణంగా స్థానిక కాకిలేరు వాగు ఉధృతంగా ప్రవహించింది. ఎస్సీ కాలనీలోకి నీరు చేరి జలమయం అయ్యింది. మరో వైపు ప్రధాన రహదారిపైన రాకపోకలు నిలిచిపోయాయి. ఈ విషయం స్పందించిన ఎస్ఐ జగన్ మోహన్ తోపాటు పోలీస్ సిబ్బంది ప్రజలు వాగులు దాటకుండా హెచ్చరికలు జారీ చేశారు. అయితే రెవెన్యూ సిబ్బంది మాత్రం 12.30 గంటలకు తహసీల్దార్‌తో పాటు తీరికగా వచ్చి పరిశీలిస్తున్నట్లు ఫొటోలు దిగడం గమనార్హం.

ఉధృతంగా నక్కల వాగు

నందికొట్కూరు రూరల్ : నందికొట్కూరు మండలంలో బుధవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి అల్లూరు- వడ్డెమాను గ్రామాల మధ్య ఉన్న నక్కల వాగు ఉధృతంగా ప్రవహించింది. దీంతో గురువారం ఉదయం రెండు గ్రామాల మధ్య ప్రజలు గంట పాటు రాకపోకలు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండలంలో 32.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ముందస్తుగా వర్షాలు కురుస్తుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీంతో రైతులు ఖరీఫ్ సీజన్‌లో పత్తి, మొక్కజొన్న, మినుము పంటల సాగుకు సన్నద్ధమవుతున్నట్లు తెలిపారు.

ఎస్సీకాలనీని సందర్శించిన ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

నందికొట్కూరు ఎమ్మెల్యేగా ఎన్నికైన గిత్తా జయసూర్య టీడీపీ మండల నాయకులు కాతా రమేష్ రెడ్డితో కలిసి గురువారం జలమయమైన మిడుతూరు ఎస్సీ కాలనీని పరిశీలించారు. కాలనీ వాసులతో నీటి ప్రవాహంపై అడిగి తెలుసుకున్నారు. నీట మునిగిన ఇళ్లను పరిశీలించారు. అదేవిధంగా వర్షం ధాటికి కూలిపోయిన ఇంటిని పరిశీలించి, బాధితురాలు వెంకటలక్ష్మమ్మను పరామర్శించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆదుకుంటామన్నారు.



వడ్డెమాను- అల్లూరు గ్రామాల మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న నక్కల వాగు



వర్షానికి వాగులో కొట్టుకు పోతున్న డ్రిప్ పైపులు

జూపాడుబంగ్లాలో 8.8 మిల్లీమీటర్ల వర్షపాతం



జూపాడుబంగ్లా వద్ద మొక్కజొన్న విత్తనాలు నాటుతున్న వ్యవసాయ కూలీలు

జూపాడుబంగ్లా: బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు మండలంలోని వివిధ గ్రామాల్లో కురిసిన వర్షం 8.8 మిల్లీమీటర్లుగా నమోదైనట్లు ఏఎస్‌ఓ హనుమంతు గురువారం తెలిపారు. నియోజకవర్గంలోని నందికొట్కూరు మండలంలో అత్యధికంగా 32.4మిల్లీమీటర్ల వర్షం కురవగా మిడుతూరులో 26.6మిల్లీమీటర్ల వర్షం కురిసిందన్నారు. జూపాడుబంగ్లాలో 8.8 ఎం.ఎం, పాములపాడులో 2.8 ఎం.ఎం, పగిడ్యాలలో అత్యల్పంగా 2.4మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. జూన్ మాసం ప్రారంభం నుంచి వరుసగా వర్షాలు కురుస్తుండగా పొలాలు పంటలసాగుకు అనుకూలంగా మారాయి. మండలంలోని తంగడంచ, తరిగోపుల, పి.లింగాపురం, తాటిపాడు, 80బన్నూరు, మండ్లెం, తర్తూరు తదితర గ్రామాల్లో బోర్లు, బావులున్న రైతులతో పాటు కేసీ కాల్వ ఆయకట్టు రైతులు, వర్షాధారంపై ఆధారపడిన రైతులు మొక్కజొన్న, పత్తి విత్తనాలను విత్తుకుంటున్నారు.

పొలాల్లోని నీరు కాలనీల్లోకి రాకుండా చర్యలు



పంట పొలాల నుంచి పారుతున్న వర్షపు నీటిని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: వీపనగండ్ల, మిడుతూరు పొలిమేర పంట పొలాల నుంచి వస్తున్న వర్షపు నీరు కాలనీల్లోకి రాకుండా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం తెల్లవారుజామున మిడుతూరు మండల పరిధిలో కురిసిన భారీ వర్షం నీరు పట్టణంలోని మారుతీనగర్, హాజీనగర్, ప్రభుత్వ వైద్యశాలలోకి చేరుతుంది. పంట పొలాల నుంచి పట్టణంలోకి పారుతున్న వర్షపు నీటిని కమిషనర్ పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ కాలనీలోకి చేరిన వర్షపు నీటితో ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. ఎక్కడ సమస్యలు వచ్చినా వెంటనే మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదులు చేయాలన్నారు.

దోమలపై అప్రమత్తంగా ఉండండి



ఓ ఇంటి ఆవరణలో దోమల మందును పిచికారీ చేస్తున్న దృశ్యం

మిడుతూరు: వర్షాలు కురుస్తున్నందున గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు దోమల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి కామేశ్వర రావు సూచించారు. గురువారం మండల పరిధిలోని నాగలూటి గ్రామంలో సర్పంచ్ ఉషారాణి ఆధ్వర్యంలో దోమల నివారణకు దోమల మందును స్ప్రే చేయించారు. ఆయన మాట్లాడుతూ దోమల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చేసుకోవాలన్నారు. టెంకాయ చిప్పలు, పాత టైర్లు, తదితర వాటిల్లో వర్షపు నీరు ఉండటం వలన దోమలు వృద్ధి చెందుతాయని చెప్పారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి రామకృష్ణయ్య, ఎంపీపీ నబిరసూల్, పంచాయతీ కార్యదర్శి వెంకటసుబ్బారెడ్డి, ఏఎన్‌ఎం శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం



క్రీడల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న లైబ్రేరియన్ మద్దమ్మ

పగిడ్యాల: జిల్లా గ్రంథాలయ అధికారి ఆదేశాల మేరకు స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం గురువారంతో ముగిసినట్లు లైబ్రేరియన్ మద్దమ్మ తెలిపారు. దాదాపు నెల రోజులుగా గ్రంథాలయంలో విద్యార్థుల చేత పలు కార్యక్రమాలు చేపట్టామని, వారికి చదువుపై ఆసక్తిని పెంచేందుకు కథల పుస్తకాలను చదివించామని వెల్లడించారు. అలాగే క్రీడల్లో రాణించేందుకు క్యారమ్స్, చెస్, స్కిప్పింగ్, క్రికెట్, తదితర ఆటలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశామని లైబ్రేరియన్ తెలిపారు. విద్యార్థులు, యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వర్షపునీటిని తొలగించాలి



ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో నిలిచిన వర్షపునీటిని చూపుతున్న ఏపీ రైతు సంఘం నాయకులు

నందికొట్కూరు: బుధవారం రాత్రి కురిసిన వర్షానికి ప్రభుత్వ వైద్యశాలలో నిలిచిన నీటిని వెంటనే తొలగించాలని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు అధికారులను కోరారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో నిలువ ఉన్న వర్షం నీటిని ఏపీ రైతు సంఘం నాయకులు విలేకరులకు చూపారు. ఆయన మాట్లాడుతూ వర్షం ఆగిపోయి గంటలు గడుస్తున్నా మున్సిపల్ అధికారులు నిలువ ఉన్న నీటిని తొలగించే చర్యలు తీసుకోలేదన్నారు. ఇకపై నీరు నిల్వ వుండకుండా మున్సిపల్ అధికారులు శాశ్వత పరిష్కారం చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నాయకులు భాస్కర్‌రాజు, ఉపేంద్రా, సుధాకర్, వలి తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై నిలిచిన నీరు తొలగింపు

సాక్షి ఎఫెక్ట్



నీరు తొలగిపోవడంతో శుభ్రంగా కనిపిస్తున్న రహదారి

పాములపాడు: మండల కేంద్రంలో మిట్టకందాల గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి, రామాలయం వద్ద ప్రధాన రహదారిపై నీరు నిలిచి కుంటను తలపిస్తుండటంపై ఈ నెల 1న 'సాక్షి'లో 'కుంటను తలపిస్తున్న రోడ్డు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన సర్పంచు మేకల భాగ్యమ్మ గురువారం రోడ్డుపై నిలిచిన నీరు తొలగించేందుకు చర్యలు చేపట్టారు. అంతర్గత రహదారి వెంట కాల్వ తీయడంతో నీరు తొలగింది. దీంతో వాహన చోదకులు, బాటసారులు హమ్మయ్యా నీరు తొలగిపోయిందని ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఎగువన ఉన్న కుళాయిలకు బిరడాలు బిగిస్తే నీరు వృథాగా పారుతుందని, వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

12న మండల సర్వసభ్య సమావేశం

కొత్తపల్లి: ఈనెల 12న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జవహర్ బాబు తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎంపీడీఓ సమావేశ భవనంలో మండల అధ్యక్షురాలు కిచ్చన్నగారి కుసుమలత అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తామన్నారు. మండలంలో మూడునెలలలో జరిగిన అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, గ్రామాలలోని సమస్యలు, పరిష్కార మార్గాలు, చేయాల్సి పనులపై చర్చ జరుగుతుందన్నారు. సమావేశానికి మండలంలోని అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కో ఆప్టెడ్ మెంబర్లు, ఇతర ప్రజాప్రతినిధులు తప్పకుండా హాజరు అవ్వాలని కోరారు.

మోడల్ స్కూల్లో ఖాళీ సీట్లకు దరఖాస్తు చేసుకోండి

పగిడ్యాల: మండల ద్రమైన పగిడ్యాలలోని మోడల్ స్కూల్లో 6, 7, 8 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సుజన గురువారం తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు వెంటనే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుకు ఈనెల 12 వరకు గడువుందన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 13న ప్రవేశపరీక్ష ఉంటుందని, అందులో ఉత్తీర్ణత సాధించిన వారికి సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 89 శాతం హాజరు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలోని నిర్వహిస్తున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో భాగంగా గురువారం జరిగిన పరీక్షలకు 89 శాతం హాజరు నమోదైందని వర్సిటీ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఉదయం సెషన్‌లో జరిగిన డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షలకు 1,542 మందికి గానూ 1,373 మంది, మధ్యాహ్నం సెషన్‌లో జరిగిన 6వ సెమిస్టర్ పరీక్షలకు 417 మందికి గానూ 381 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2, కర్నూలు డిగ్రీ కళాశాల, సాయికృష్ణ డిగ్రీ కళాశాల, తుగ్గలి ఏఎస్ డిగ్రీ కళాశాల, బేతంచర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రాల్లో ఒక్కొక్కరు చొప్పున మొత్తం ఆరుగురు విద్యార్థులు చూచిరాతలకు పాల్పడగా డిబార్ చేసినట్లు తెలిపారు.

నీటివృథాను అరికట్టండి



పైపులీకేజీ కావడంతో వృథా అవుతున్న తాగునీరు

జూపాడుబంగ్లా: కస్తూర్బా పాఠశాలకు ఎదురుగా తాగునీటి పైపు లీకేజీ కావడంతో నిత్యం తాగునీరు వృథా అవుతోంది. ఈ పైపులైన్ ద్వారా ఉన్నత పాఠశాల, కస్తూర్బా పాఠశాల, మోడల్‌పాఠశాల, ఉపాధి హామీ, మండల మహిళా సమాఖ్య కార్యాలయాలకు నీరు సరఫరా అవుతుంది. పైపు లీకేజీ కావడంతో నిత్యం తాగునీరు వృథా కావడమే కాకుండా కలుషితమయ్యే అవకాశం ఉంది. పైపులకు మరమ్మతులు చేయించి నీటివృథాను అరికట్టాలని పాఠశాలల ఉపాధ్యాయులు, అధికారులు కోరుతున్నారు.

వైభవంగా మహానందీశ్వరుడి కల్యాణం



కల్యాణ పూజల్లో స్వామి అమ్మవార్లు

మహానంది: మహానందిలో కొలువైన శ్రీకామేశ్వరి దేవి, మహానందీశ్వర దంపతులకు గురువారం కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు స్థానిక అలంకార మండపంలో గణపతి పూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, మాంగళ్యధారణ, అక్షింతల సమర్పణ చేశారు. పలు ప్రాంతాల భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు.

10న చలో సిద్ధేశ్వరం



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

నంద్యాల(సెంట్రల్): సిద్ధేశ్వరం అలుగు 8వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 10వ తేదీన చలో సిద్ధేశ్వరం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథ రామిరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక సమితి కార్యాలయంలో 8వ వార్షికోత్సవ కరపత్రాలను కార్యవర్గ సభ్యులతో కలిసి విడుదల చేశారు. రాయలసీమ కరవు సమస్యకు పరిష్కారంతో పాటు, శ్రీశైలం ప్రాజెక్టు జీవిత కాలం పెరగడానికి కీలకమైన సిద్ధేశ్వరం అలుగు శంకుస్థాపన వేలాదిమంది మధ్య మే 16, 2016న ప్రజాసంఘాలు నిర్వహించాయని గుర్తు చేశారు. ఎన్నికల ముందు రాజకీయ పార్టీలు మేనిఫెస్టోలో రాయలసీమ అంశాలను ఏకరువు పెట్టడం, అనంతరం మోసం చేయడం పరిపాటిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీమ సాగునీటి ప్రాజెక్టులకు బడ్జెట్లో 41 శాతం నిధులు కేటాయించాలని, తెలుగుగంగ, గాలేరు-నగరి, హంద్రీనీవా, వెలిగొండ ప్రాజెక్టులు సత్వరం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. గుండ్రేవుల, రిజర్వాయర్, వేదవతి ఎత్తిపోతల పథకం, తుంగభద్ర సమాంతర కాలువ, ఆర్‌డీఎస్ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలన్నారు. కృష్ణా నదిపై నిర్మిస్తున్న ఐకానిక్ వంతెనకు బదులుగా రోడ్డు కం అలుగు నిర్మించేటట్లుగా కేంద్రాన్ని నూతన ప్రభుత్వం ఒప్పించాలని కోరారు. కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని రాయలసీమ ఉజ్వల భవిష్యత్‌కు పాలకులపై ఒత్తిడి పెంచేలా సహకరించాలని పిలుపునిచ్చారు. సమితి ఉపాధ్యక్షులు వైఎస్ రెడ్డి, ఏరువ రామచంద్రారెడ్డి, రాఘవేంద్ర గౌడ్, మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

మల్లన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే బుడ్డా



మల్లన్న దర్శనం అనంతరం ఆలయంలో ఎమ్మెల్యే బుడ్డా దంపతులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామి అమ్మవార్లను శ్రీశైలం నియోజకవర్గానికి నూతనంగా ఎన్నికైన శాసనసభ్యులు బుడ్డా రాజశేఖర్ రెడ్డి దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. గురువారం మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు చేరుకున్న ఎమ్మెల్యే బుడ్డా దంపతులకు ఆలయ రాజగోపురం వద్ద ఆలయ అధికారులు, అర్చకస్వాములు, వేదపండితులు ఆలయ సంప్రదాయ ప్రకారంగా స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామివారికి అభిషేకాన్ని, అమ్మవారికి కుంకుమార్చన జరిపించుకున్నారు. అమ్మవారి ఆలయం వద్ద గల ఆశీర్వచన మండపంలో ఎమ్మెల్యే దంపతులకు వేదపండితులు, అర్చకులు వేదాశీర్వచనంతో శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్యే బుడ్డా వెంట శ్రీశైల మండల టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఉన్నారు.

కస్తూర్బాలో 10 సీట్లు ఖాళీ

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లా కస్తూర్బా పాఠశాలలోని ఇంటర్ ప్రథమ ఏడాది బైపీసీలో 6 సీట్లు, ద్వితీయ ఇంటర్‌లో 4 సీట్లు ఖాళీ ఉన్నట్లు పాఠశాల ఎస్‌ఓ యశోద గురువారం తెలిపారు. వీటిని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలో భర్తీచేస్తామని చెప్పారు. ఆరో తరగతిలో 40మంది విద్యార్థులు చేరగా సీట్లు భర్తీ అయినట్లు తెలిపారు.

మహానందిలో భక్తుల సందడి



కోనేరులో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

మహానంది: వేసవి సెలవులు ఉండటంతో మహానంది ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. ఈ మేరకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలి వచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు స్థానిక కోనేర్లలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీకామేశ్వరిదేవి సహిత మహానందీశ్వర స్వామి వారిని దర్శించుకొని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. అలాగే మహానందిలో కొలువైన శ్రీవీరభద్రస్వామికి గురువారం విశేష పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని కోదండ రామాలయం, వినాయక నంది, గరుడనంది ఆలయాలను సందర్శించారు.